క్లుప్తంగా

జీఓ 3 పునరుద్ధరించాలి

సీతంపేట: జీఓ 3 పునరుద్ధరించాలని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఈ నెల 24 నుంచి జరగనున్న శాసనసభా సమావేశాల్లో జీఓ 3పై ప్రస్తావించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే ఎన్. జయకృష్ణకు వినతి పత్రం అందజేశారు. గిరిజన అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర, చింతపండు, కొండచీపుర్లకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. అలాగే స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు.

పీ 4 సర్వేకు సహకరించండి

పాలకొండ: ప్రభుత్వం చేపడుతున్న పీ 4 సర్వేకు ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇంటింటికీ సర్వే చేయడం ద్వారా ప్రజల ఆర్థిక స్థితిగతులను గుర్తించడం జరుగుతుందన్నారు. మార్చి 2వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది ఈ సర్వే చేపడతారన్నారున. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికాకుండా సర్వేకు సహకరించాలని కోరారు.

పీసా చట్టంపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

సీతంపేట: స్థానిక వైటీసీలో పీసా చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. 41 షెడ్యూల్డ్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ సభ్యులు, పీసా వైస్‌ప్రెసిడెంట్లు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పీసా చట్టంలో ముఖ్యమైన ఏడు విభాగాలు, 2006 చిన్న తరహా అటవీ ఉత్పత్తులపై వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ త్రినాథరావు, డివిజనల్ పంచాయతీ అధికారి జయంతి రమాప్రసాద్, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు


జంపరకోటలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఏఈ మాధవరావు

పాలకొండ రూరల్: గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి మార్చి 25 నాటికి పూర్తి చేయాలని హౌసింగ్ సహాయ ఇంజినీర్ మాధవరావు అన్నారు. మండలంలోని జంపరకోట, దోలమడవలస, సిం.సింగుపురం, తదితర గ్రామాల్లో శనివారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, నిర్మాణాలు చేపడితే బిల్లులు త్వరితగతిన చెల్లిస్తామన్నారు.

ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సీతంపేట: ఏపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం ప్రచారం చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికలు, బాలుర ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రచారం చేసి మొదటి ప్రాధాన్యత ఓటు రఘువర్మకు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సరస్వతి, డి.లక్ష్మీనరసింహ, రఘు, మహంతి, నారాయణరావు, వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పనిలో పెట్టడం నేరం


పట్టణంలో అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖాధికారులు

పార్వతీపురం టౌన్: పిల్లలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని జిల్లా సహాయ కార్మిక అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. కార్మిక చట్టాల అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ దుకాణాల వద్ద పోస్టర్లను పంపిణీ చేసి అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల్లోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధించినట్టు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు, వారి భవిష్యత్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చట్టాలను తెచ్చిందన్నారు. వీటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేసవిలో.. పశువులకు పొంచి ఉన్న సమస్యలు..

● వడదెబ్బతో పాల ఉత్పత్తిపై ప్రభావం

పాలకొండ రూరల్:



వేసవిలో పశువులు ఎండవేడిమి తాళలేక వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పాడి రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వడదెబ్బ కారణంగా పాల ఉత్పత్తిలో వ్యత్యాసాలు వస్తాయి. ఏమాత్రం అలసత్వం వహించినా పశువులు, మూగజీవాలు మృత్యువాత పడే ప్రమాదముంది. ఎండలు ఎక్కువగా ఉంటే పశువుల మెదడులో హైపోథాలమస్ స్వేద గ్రంధులు పట్టుకోల్పోతాయి. దీంతో చెమట రూపంలో ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీరం పనితీరు మందగిస్తుంది. శ్వాస, నాడి, గుండె వేగం పెరుగుతుంది. మూత్రపిండాలు సక్రమంగా పనిచేయక పోవడంతో మూత్ర విసర్జన లోపం తలెత్తే ప్రమాదం ఉంటుంది. పశువులు అపస్మారక స్థితికి చేరుకుని ఊపిరి ఆడక మృత్యువాత పడతాయి. పాడి సంపద విషయానికి వస్తే పాలకొండలో 14,321, వీరఘట్టంలో 11,502, సీతంపేటలో 8,102, భామిని మండలంలో 13,625 పశువులు (ఆవులు, గేదెలు) ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ తరుణంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవగాహన పెంచుకోవాలని సంబంధిత వైద్యులు సూచిస్తున్నారు.

వడ దెబ్బ లక్షణాలు ఇలా.....

వడదెబ్బకు గురైన పశువుల శరీరం ఉష్ణోగ్రత 103 ఫారన్‌హీట్‌కు మించి ఉంటుంది. చర్మం తన సున్నితత్వాన్ని కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట చొంగ కారుతుంది. నీడకోసం చెట్ల కింద కూలబడిపోతాయి. శ్వాస పీల్చడం కష్టమై అపస్మారక స్థితికి చేరుతాయి. ముఖ్యంగా చూడి పశువుల్లో గర్భస్రావం జరిగే అవకాశాలుంటాయి. పాలదిగుబడి ఘణనీయంగా తగ్గుతుంది. దూడలు అతిసార బారిన పడతాయి. వడదెబ్బకు గురైన పశువులను తక్షణమే చల్లని ప్రదేశంలో ఉంచి గాలి అందేలా చూడాలి. వాటి శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు చల్లని నీటితో కడగాలి. తడిసిన గోనెసంచులు కప్పడం ద్వారా ఉపశమనం కల్పించవచ్చు. అలాగే నీటిని అందుబాటులో ఉంచాలి. వైద్యుల సలహా మేరకు అనాల్జిన్ ఇంజిక్షన్ చేయించాల్సి ఉంటుంది. రక్తంలో డెక్ట్రోజ్ సెలైన్ ఎక్కించడం ద్వారా సరైన గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అందించాల్సిఉంటుంది. తద్వారా పశువులు నీరసించిపోకుండా కాపాడవచ్చు.

జాగ్రత్తలు ఇలా....


రైతులకు వేసవి సమస్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు (ఫైల్)

- ఎండలో పశువులను మేతకు వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయంలో మేతకు తీసుకు వెళ్లాలి.
- ముఖ్యంగా తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలి. సగటున రోజుకు 3 నుంచి నాలుగు సార్లు చల్లటి నీటితో కడగడం మంచిది.
- నాటుజాతి పశువుల కంటే సంకరజాతికి చెందిన ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వీటిపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి.
- పశువులుంటే రేకుల షెడ్డు కప్పులపై వరి లేదా ఇతర గడ్డి కప్పి దానిని నీటితో తపడపడం మంచిది.
- వడగాలుల నుంచి రక్షణ కల్పించేందుకు గోనెసంచులు తడిపి పశువుల శాలల వద్ద ఏర్పాటు చేయడం మంచిది.

విస్తృత అవగాహన కల్పిస్తున్నాం..

వేసవిలో పశువుల ఆరోగ్య సమస్యలు అధిగమించే విధానాలపై రైతులు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులను సమర్థవంతంగా తిప్పికొట్టేలా మందులు అందిస్తున్నాం. పశులకు సంబంధించి వడదెబ్బ లక్షణాలపై అవగాహన పెంచుకోవాలి. అవసరమైన వసతులు కల్పించడంతో పాటు వైద్యుల సూచనలు పాటించాలి.

– డాక్టర్ సిద్ధార్థ, పశు వైద్యాధికారి

కూనేరులో మెగా వైద్యశిబిరం


కూనేరులో గిరిజనులకు తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

కొమరాడ: మండలంలోని కూనేరు మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో కొమరాడ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైజాగ్‌కు చెందిన ఇండస్ హాస్పిటల్ వైద్యులు పాల్గొని సుమారు 500 మంది గిరిజనులకు తనిఖీలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నీలకంఠం మాట్లాడుతూ.. మారుమూల గిరిజనులకు ఈ వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని.. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు గొడుగులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్ మోహనరావు, వైద్యులు ఎం.వంశీ, సౌజన్య, రాహుల్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు స్పెషల్ డ్రైవ్

● ఈఓపీఆర్‌డీ ధర్మారావు


కేదారిపురంలో చెత్త సేకరిస్తున్న శానిటేషన్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేందుకే స్పెషల్ శానిటేషన డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ కె.ధర్మారావు తెలిపారు. ఈ మేరకు జిల్లా పంచాతీ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. ఎల్విన్‌పేట గ్రామంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను ఈఓపీఆర్‌డీ పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇంటింట చెత్త సేకరణ..

సీతంపేట: మండల కేంద్రంలోని వీధుల్లో పరిసరాల పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సత్యం, గ్రామకార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు


ముస్తాబైన గిజబ శివాలయం ఇదే

గరుగుబిల్లి: మండలంలోని పలు శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబవుతున్నాయి. మండలంలోని నాగూరులోని చంద్రశేఖరస్వామి, గొట్టివలసలోని కాశీవిశ్వేశ్వరస్వామి, శివ్వాంలోని ఉమారామలింగేశ్వరస్వామి, సన్యాసిరాజుపేటలోని కాశీవిశ్వేరస్వామి, రావివలస, ఉల్లిబద్ర, రావుపల్లి, కొత్తూరు, పెద్దూరు, గిజబ, తదితర గ్రామాల్లోని శివాలయాలను శివరాత్రి నేపథ్యంలో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. 26న శివరాత్రి కావడంతో భక్తులకు ఇబ్బందుల్లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్ దీపాలతో ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

గ్రావెల్ తవ్వకాలపై దృష్టి సారించండి..

● సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు


తవ్వకాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని అల్లువాడ, తుంబలి గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఆనుకుని జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై అధికారులు దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. పది రోజులుగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని సీపీఎం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ.. ఇప్పటికే రెవెన్యూ అధికారుల చొరవతో రెండు లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ అక్రమ తవ్వకాలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె. సీతారాం పాల్గొన్నారు.

సారా పట్టివేత

పాలకొండ రూరల్: మండలంలోని శివారు గ్రామాల్లో పాలకొండ ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చేపట్టగా 35 లీటర్ల సారాతో ఇద్దరు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై సీహెచ్ రాజేశ్వరి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమీషనర్ పి.రామచంద్రరావు నేతృత్వంలో సరిహద్దు గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానాస్పదంగా ఉన్న బి.అప్పయమ్మ, ఆర్.పార్వతిలను అదుపులోకి తీసుకోగా.. సారా పట్టుబడిందన్నారు. ఈమె వెంట హెచ్‌సీలు జి.సుదర్శన్‌కుమార్, కె.రాంబాబు, బి.రాము, తదితరులున్నారు.

భాషపై పట్టు సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం పరాంకుశంనాయుడు

పాలకొండ: విద్యార్థులు భాషపై పట్టు సాధించాలని పట్టణంలోని వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జి. పరాంకుశంనాయుడు అన్నారు. విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషా దినోత్సవాల నేపథ్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ఉదయభాను, వి. నాగమణి, డి. గౌతమి, కె. రమాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎం.సింగుపురంలో ఆధ్యాత్మిక వాతావరణం


ఉత్సవమూర్తులతో తిరువీధి

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో కొలువైన సోమేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి, గణపతి, గౌరీదేవి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ మేరకు ఉత్సవమూర్తులను శనివారం ఊరేగించారు. తొలి రోజు విఘ్నేశ్వర పూజ, కంకణధారణ, మండప ఆరాధన నిర్వహించారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో ఉపాధి పనులు జరుగుతున్న చోట అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ వీవీ.రంగారావు అన్నారు. మండల పరిధిలోని వెలగవాడ, సింగన్నవలస, మల్లమ్మగూడలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, వేతనదారుల సంఖ్యపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేతనదారులే తాగునీరు సమకూర్చుకోవాలని సూచించారు. ఎండల నేపథ్యంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు పనులు చేపట్టాలని సూచించారు.


మల్లమ్మగూడలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగారావు

హెల్మెట్ ధరించాలి

భామిని: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం వాహన తనిఖీలు నిర్వమించారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు.

సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● డీపీఓ కొండలరావు


ఉల్లిభద్రలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

గరుగుబిల్లి: గ్రామాలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో పారిశుధ్య నిర్వహణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేకరించిన చెత్తలో ప్లాస్టిక్, గాజు పరికరాలను వేరుచేయాలన్నారు. చెత్తసేకరణలో గ్రీన్ అంబాసిడర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని 451 గ్రామ పంచాయతీల్లో ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్, ఒక ట్రై సైకిల్‌ను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



జియ్యమ్మవలస మండలంలోని వెంకటరాజపురంలో సీతారాముల కల్యాణ మహోత్సం రెండు రోజులుగా కనులపండువగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహమండపం పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం సీతారాముల ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు వేదుల గోపాలకృష్ణశర్మ, తిమిటి కృష్ణారావు, వినోదశర్మ, వేదుల శశిశేఖర కూర్మారావుశర్మ, తిమిటి ప్రభాకరశర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

– జియ్యమ్మవలస

అన్న సంతర్పణ..



వీరఘట్టం మండల కేంద్రంలోని గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. అంతకుముందు యజ్ఞకర్త ఎస్‌వీఎన్‌ఎల్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– వీరఘట్టం

సందర్శన..



సీతంపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీఓ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదో తరగతిలో ఉత్త మ ఫలితాలు సాధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి


ఆర్టీసీ డిపో అధికారి సింహాచలంనకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ కోరారు. ఆర్టీసీ డిపో అధికారి సింహాచలంకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. హాల్‌టికెట్ ఉన్న విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్టూడెంట్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమయపాలనతో బస్సులు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఉన్నారు.

రెండు పూటలా పనులు చేయండి

గరుగుబిల్లి: ఉపాధి వేతనం గిట్టుబాటు కావాలంటే రెండుపూటలా పని చేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని మరుపెంటలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. వేసవి దృష్ట్యా పనులు జరిగే ప్రాంతం వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈమెతో పాటు ఏపీఓ గౌరీనాథ్, సాంకేతిక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మరుపెంటలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి